

# ‘మార్పు కోసం ముందడుగు’ రెండో విడత ప్రారంభం

- **నేరాలు చేసిన వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం**

**ఎల్బీనగర్, వెలుగు:** నేరాల బాట పట్టకుండా కష్ట పడి పనిచేసుకోవడంతో పాటు మెరుగైన జీవనాన్ని ప్రారంభించేలా రాచకొండ క్రైమ్స్ విభాగం నిర్వహిస్తున్న ‘మార్పు కోసం ముందడుగు’ రెండో విడతను శనివారం ప్రారంభించారు. ఎల్బీనగర్ పరిధిలోని కుషాల్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహేశ్వరం, ఎల్బీనగర్ జోన్ లోని 14 పీఎస్ పరిధిల్లో ఉండే దాదాపు 400 మంది క్రైమ్ రికార్డు ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి స్వయం ఉపాధి కోసం పలు అంశాల్లో శిక్షణ ఇచ్చేలా లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్స్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. నేరస్థుల పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు ఇప్పించేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోంది. గంజాయి, మద్యం వ్యసనాలతో సతమతమయ్యే నేరస్తులకు డాక్టర్లతో కౌన్సెలింగ్ ఇప్పిస్తోంది. మొదటి విడతలో భాగంగా ఇప్పటికే 318 మందికి నేరస్తుల ఆర్థిక, కుటుంబ స్థితిగతులు, ఆరోగ్య వివరాలు తెలుసుకొని వారికి కౌన్సెలింగ్ ఇప్పించారు. ఉపాధి మార్గాలు చూపించారు.

**క్రైమ్ రికార్డు తొలగిస్తం: సీపీ**

నిత్యం నేరాలకు పాల్పడే వారితో సమాజానికి ఎంతో ఇబ్బందని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ‘ఆర్థిక ఇబ్బందులు, ఈజీ మనీ, ఇతర సమస్యలతో కొందరు చోరీల బాటపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పాత నేరస్తులను గుర్తించి వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఐదేండ్లుగా నేరాలకు పాల్పడని పాత నేరస్తుల క్రైమ్ రికార్డును తొలగించేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. నేరస్తుల్లో మార్పు తెచ్చేందుకు ప్రత్యేకంగా ముందడుగు కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. తొందరలోనే రాచకొండ వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి నేరాల బాట పట్టకుండా వారిలో మార్పునకు ప్రయత్నం చేస్తున్నాం’ అని సీపీ చౌహాన్ పేర్కొన్నారు.

# నేరాల బాట వీడండి

నాగోలు: గతంలో నేరాలకు పాల్పడినవారు ఆ బాట వీడి ప్రస్తుత సమాజంలో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. శనివారం ఎల్బీనగర్‌లో కుషాల్ గార్డెన్స్‌లో పాత నేరస్తులలో 'మార్పు కోసం ముందడుగు' పేరుతో పాత నేరస్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ.. గతంలో తొందరపాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబాలు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నేరస్తులు గతాన్ని మరిచి మారిన మనసుతో ముందడుగు వేయాలని సూచించారు. నేరస్తులలో మార్పు తీసుకురావడం కోసం వారి కుటుంబ సభ్యుల పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. జైలులో గడిపే వారికంటే నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండే వారికి కుటుంబంతో సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ.. నేరాలు చేసి జైలుకు వెళితే తమ కుటుంబ పరిస్థితి ఏంటనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. సమాజంలో గౌరవంగా బతకాలంటే అనేక ఉపాధి మార్గాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, అదనపు డీసీపీ మధుకర్ స్వామి, డీసీపీ లక్ష్మి, ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

**రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్**



**పాత నేరస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు**

# పాతనేరస్థుల్లో సత్ప్రవర్తనకై "మార్పు కోసం ముందడుగు" సదస్సు

## రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్



ఎల్.బి.నగర్ ఏప్రిల్ 01(విజన్‌ఆంధ్ర-ప్రతినిధి):సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే సత్ప్రవర్తన ఎంతో ముఖ్యమని రాచకొండ పోలీస్ కమీషనర్‌రేట్ పోలీస్ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారు. శనివారం రాచకొండ కమీషనర్‌రేట్ పరిధిలోని ఎల్.బి.నగర్ డీసీపీ జోన్ కుషల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో రాచకొండ పోలీసు అధికారులు పాతనేరస్థుల్లో సత్ప్రవర్తన కోసమై ఏర్పాటు చేసిన మార్పు కోసం ముందడుగు సదస్సుకు వక్తలు ఆకెళ్ళ రాఘవేందర్, ఎల్.బి.నగర్ డీసీపీ సాయిశ్రీ, డీసీపీ పి మధుకర్‌స్వామి, అదనపు డీసీపీ లక్ష్మీ, ఏసీపీలు కె పురుషోత్తంరెడ్డి, పి శ్రీధర్‌రెడ్డి, వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీపీ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సుకు 4వందల మంది నేరస్థుల కుటుంబసభ్యులు హాజరైన సందర్భంగా సీపీ మాట్లాడుతు గతంలో నేరాలకు పాల్పడిన వారు ప్రస్తుతం ఉన్న సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సీపీ సూచించారు. నేరస్థులు, అనుకోని సందర్భాల్లో నేరాలు చేసిన వారు తరువాత పరిణామాలను ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకుని చిన్నాభిన్నమైన కుటుంబ జీవన స్థితిగతులు, ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఇకనైనా పద్ధతులు మార్చుకోవాలని లేని యెడల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీ హెచ్చరించారు. మనిషిలో మార్పు రావడం సహజం, వచ్చిన మార్పుతో మంచిగా జీవించాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కల్గించుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సీపీ తెలియజేశారు. ఏ నేరం చేసినా ఎప్పుడో ఒకప్పుడు పోలీసులకు ఖచ్చితంగా చిక్కుతారని ఈ అంశాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిగా కుటుంబంతో కలిసి జీవించాలని సీపీ తెలిపారు. మార్పు ఎక్కడో ఒక చోట, ఏదో ఒక సందర్భంలో వచ్చినప్పుడే జీవితంలో ఉన్నతస్థాయిలకు చేరుకుంటారని నేరస్థుల కుటుంబసభ్యులకు తెలియాజేశారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్, పోలీసు అధికారులు తీసుకు వచ్చినటువంటి మార్పు కోసం ముందడుగు అనే కార్యక్రమం తమ జీవితాల్లో ఖచ్చితంగా మార్పు వచ్చే విధంగా తీర్చిదిద్దుకుంటామని, తమ మేలుకు కృషి చేసిన సీపీ, పోలీసు అధికారులకు పాత నేరస్థులు, వారి కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మార్పు కోసం ముందడుగు

- నేరాలకు దూరం.. మెరుగైన జీవనానికి ఆధారం
- నేరస్తుల్లో సత్ప్రవర్తనకు రాచకొండ పోలీసుల యత్నం
- సత్ఫలితాలు ఇస్తున్న పోలీసుల కృషి
- నేరస్తుల్లో పరివర్తన తెచ్చేలా ప్రయత్నం: రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



ఎల్బీనగర్‌లోని కుషాల్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : సులభంగా డబ్బులు సంపాదించాలి... కష్టపడే తత్వం ఉన్నప్పటికీ, డబ్బును తేలికగా పోగు చేసుకోవాలన్న అత్యాశతో చోరీలకు అలవాటు పడుతూ నిత్యం జైలునే ఇళ్లుగా మార్చుకుంటున్నారు కొందరు నేరస్తులు. ఈ క్రమంలో జైలుకు వెళ్తున్న నేరస్తుల కుటుంబాలు మాత్రం నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నాయి. ఈ పరిస్థితుల నుంచి నేరగాళ్లు, వాళ్ల కుటుంబాలను సమాజంలో తలెత్తుకునే విధంగా చేసేందుకు రాచకొండ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేరస్తులు నేరాల బాట పట్టకుండా, సభ్య సమాజంలో కష్టపడి పని చేసుకోవడంతో పాటు మెరుగైన జీవనాన్ని కలిగించేలా 'మార్పు కోసం ముందడుగు' పేరుతో రాచకొండ క్రైమ్స్ డీసీపీ పరవస్తు మధుకర్‌స్వామి నేతృత్వంలో ఓ నూతన కార్యక్రమాన్ని తలపెట్టారు. నేరస్తులు మరోసారి చోరీల బాట పట్టకుండా ఉండేందుకు రాచకొండ పోలీసులు తీసుకుంటున్న చర్యలపై సర్కారు సైతం చేయూతనిస్తుంది.

## స్వయం ఉపాధి కల్పించే దిశగా..

మార్పు కోసం ముందడుగు కార్యక్రమంలో భాగంగా రాచకొండ క్రైమ్స్ డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి నేతృత్వంలో నిర్వహించిన తొలి విడతలో భాగంగా రాచకొండలోని 9 పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 318 మంది నేర చరిత్ర ఉన్న వ్యక్తులను గుర్తించారు. వారి ఆర్థిక, జీవన, కుటుంబ స్థితిగతులు, ఆరోగ్య వివరాలన్నీ తెలుసుకుని, పూర్తిగా నేరాలు మానేసి కొత్త జీవితాన్ని ప్రారంభించేలా మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించారు. రెండో విడతలో భాగంగా శనివారం ఎల్బీనగర్ పరిధిలోని కుషాల్ గార్డెన్‌లో నిర్వహించిన 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమంలో రాచకొండ పరిధిలోని మహేశ్వరం, ఎల్బీనగర్ జోన్‌లలోని 14 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాదాపు 400 మంది నేర చరిత్ర ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారి స్వయం ఉపాధి కోసం లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి పలు అంశాల్లో శిక్షణనిచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. దీంతో పాటు పోలీస్ శాఖ అధ్వర్యంలో నేరస్తులకు పిల్లలుంటే వారికి గురుకులాల్లో ప్రవేశాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటుంది. అదే విధంగా ఎక్కువ మంది నేరస్తులు గంజాయి, మద్యం వ్యసనాలతో సతమతమవుతుంటే వారిని ప్రముఖ మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించేలా ముందడుగు వేస్తున్నారు. పలువురు వక్తలు నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం నేరస్తులతో రాచకొండ పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ హైదరాబాద్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీకుమారి, ఆకెళ్ల రాఘవేంద్ర, రాజ్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, అడిషనల్ డీసీపీ లక్ష్మి, ఎల్బీనగర్, వనస్థలిపురం, ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డితో పాటు ఫింగర్ ప్రింట్ విభాగం ఏసీపీ నందకుమార్, ఆయా పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సమాజాభివృద్ధికి తోడ్పడాలి

నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తనతో తమ కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పాటునందించాలి. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌ల్యాండ్స్ హైదరాబాద్ సంస్థ ద్వారా మార్పు కోసం పురుషులు , మహిళలకు ఉచితంగా పలు రంగాల్లో అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. పురుషుల ఉపాధి కోసం డ్రైవింగ్, మెకానిక్‌తో పాటు వృత్తి నైపుణ్య శిక్షణలు, మహిళలకు కుట్టుమిషన్‌తో సహా పలు అంశాలపై శిక్షణనివ్వడం, ఉపాధి కల్పించడం జరుగుతుంది. క్షణికావేశంలో చేసే చిన్న పొరపాటు మనతో పాటు సమాజంపై దుష్ప్రభావం చూపుతుంది. ఇప్పటికైనా నేరాల బాట వదిలి మెరుగైన జీవనం వైపు అడుగులు వేయాలి.

– ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకుమారి, అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌ల్యాండ్స్ హైదరాబాద్

### మార్పు తెచ్చేందుకు యత్నిస్తున్నాం



ఎంతో మంది ఆర్థిక ఇబ్బందులు, సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే కారణమో, ఇతర సమస్యలతో తెలిసోతెలియకో చోరీల బాట పట్టి జైలు జీవితం గడుపుతారు. ఈ క్రమంలోనే పాత నేరస్తులను గుర్తించి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాం. ఐదేండ్లకు మించి నేరాలకు పాల్పడకుంటే కచ్చితంగా అధికారులతో మాట్లాడి నేర చరిత్ర తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. నేరస్తుల్లో మార్పు తీసుకురావడానికి ప్రత్యేకంగా 'మార్పు కోసం ముందడుగు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. త్వరలోనే రాచకొండ వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి నేరాల బాట పట్టకుండా వారిలో మార్పుకు ప్రయత్నం చేస్తున్నాం.

– పరవస్తు మధుకర్‌స్వామి, డీసీపీ, రాచకొండ క్రైమ్స్

### నేరస్తుల్లో పరివర్తన తెచ్చేలా...

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. చెడు లక్షణాలను దూరం చేసి మంచి నడవడికతో ముందడుగు వేయడంతో పాటు పరివర్తన తెచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేరాలకు దూరంగా ఉంటూ ప్రస్తుత సమాజంతో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాల్సిన అవసరం ఉన్నదన్నారు. నేరస్తులు తొందరపాటుతో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందన్నారు. గతాన్ని మరిచిపోయి మారిన మనసుతో ముందడుగు వేయాలని, అందులో వారి కుటుంబ పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు.

# 'మార్పు కోసం ముందడుగు'

## నేర చరిత్ర వారిలో వారి కోసం ముందడుగు: సిపి



మన తెలంగాణ/ ఎల్బీనగర్ : నేరం చేయలంటే ఆలోచన అవసరం... దీంతో నేరాలు చేయకుండా అభివృద్ధి చెందలాని ఆలోచన చేస్తే ఆర్థికాభివృద్ధి చెంది కుటుంబం అంతా బాగుంటుందని రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ అన్నారు. ఎల్బీనగర్ కుషాల్ ఫంక్షన్ హాల్‌లో 'మార్పు కోసం ముందడుగు ' పేరుతో నేర చరిత్ర వారిలో మార్పు కోసం 400మంది నేర చరిత్రల కు టుంబ సభ్యులతో సమావేశం ఏర్పరచారు. ఈ సమావేశానికి రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ... దేశంలో అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు బాగా ఉన్నాయిని , కష్టపడితే ఉద్యోగం సాధించవచ్చని ,ఉద్యోగం పొంది నైపుణ్యం సాధిస్తే అభివృద్ధి చెందవచ్చని సూచించారు. నేరం చేసి జైలుకు పోయి వచ్చిన తరువాత సమాజం ఒక రకంగా చూస్తుందని , దీంతో నేరాలకు పాల్పడకుండా ,ఉపాధి అవకశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. సమాజంలో గౌరవం పొందలాంటే మీలో మార్పు రావాలన్నారు. మీలో మార్పు రావాలి ,మార్పు రాకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మార్పు వస్తే మంచిది ,మాతో సహాయ సహకారాలు అందుతాయని, మీ అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఎలాంటి తప్పుల చేయకుండా జన స్రవంతిలో ఉండాలని తెలిపారు. నేరాలు చేయవద్దని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేందర్ , ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ ,డీసీపీ మధుకర్‌స్వామి ,అదనపు డీసీపీ లక్ష్మి ,ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి ,పురుషోత్తం రెడ్డి ,వేంకటేశంలు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మారండి.. జీవితాన్ని మార్చుకోండి

ఈనాడు– హైదరాబాద్: పాత నేరస్థుల్లో పరివర్తన తీసుకొచ్చి సరికొత్త జీవితాన్ని ప్రారంభించేలా 'మార్పు కోసం ముందడుగు' పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. కొందరు వ్యక్తులు తొందరపాటులో చేసిన నేరానికి.. వారి కుటుంబాలు సమాజంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎల్బీనగర్‌లో శనివారం 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఎల్బీనగర్, మహేశ్వరం జోన్ల పరిధిలోని 400 మంది పాత నేరస్థులు, వారి కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో నేరాలు చేసినా.. మర్చిపోయి నవ జీవితాన్ని ప్రారంభించాలని, సమాజంలో హుందాగా ఉండాలని చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

### శిక్షణతో పాటు ఉపాధి..

రాచకొండ క్రైమ్స్ డీసీపీ పరావస్తు మధుకర్ స్వామి మాట్లాడుతూ.. నేరాలు మానితే డ్రైవింగ్, బ్యూటీపార్లర్, ఫ్యాషన్ డిజైనింగ్, మెకానిక్ ఇలా పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కూడా చూపిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబపరంగా ఏ సమస్య ఉన్నా నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పాత నేరస్థులతో తాము ఇకపై నేరమయ జీవితానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, రాచకొండ క్రైం అదనపు డీసీపీ లక్ష్మి, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్(గ్రీన్‌ల్యాండ్స్) ప్రతినిధులు ప్రొ.లక్ష్మి, ప్రొ. రాజ్‌కుమార్, ప్రాంతీయ ఛైర్మన్ రఘునాథ్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.